చిన్నకథ

# మురుగుకు జేజేలు

శ్వేత సౌధంలో నల్లకలువ. పాత సీసా మీద కొత్త లేబుల్ రాష్ట్ర బడ్జెట్టు. ఎన్నికల సంగ్రామానికి పొత్తుల కుంపట్లు, పార్టీలో వలసలు, విలీనాలు. కుంభకోణాలు, టి.వి.లో క్రైమ్ స్టోరీలు, విజయ సంకల్ప యాత్రలు. యాసిడ్ దాడులు. యాంటి కరప్షన్ దాడులు పావలా వడ్డీలు, స్విస్ బ్యాంకుల్లో భారతీయుల గుప్త నిధులు.

***

కాలేజీ గర్ల్ తన క్లాస్‌మేట్ మొహంలో మొహం పెట్టి 'నీ మొహం అద్దంలో చూసుకోరా' అనడం.. ఇలాంటివి జరిగిపోతూనే వుంటాయి. అయితే పై సంఘటనలు గాని, సన్నివేశాల్తో గాని మనకేం సంబంధంలేని సమయం అమెరికాలో తెల్లవారుఝాము నాలుగు గంటల ఇరవై నిముషాలు(ఇక్కడ ఈ సందర్భం ఏంటి? అవును! అమెరికా అగ్రరాజ్యానికి జలుబు చేస్తే ఇక్కడ హై ఫీవర్ రావడం నిజం కదా!) ఇక ఇండియన్ స్టాండర్డు టైము సాయంత్రం మూడు గంటల నలభై అయిదు నిముషాలు.

ఓ చౌరస్తాలో వున్న ఫాస్టు ఫుడ్ సెంటర్ మన సజీవ కథకి వేదిక.

రెండు రోడ్లని కలుపుకున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్. మంచూరియా, నూడుల్స్ కుక్ చేతిలో అట్ల కాడ బాండిలో వున్న తెల్లటి చిక్కరిబిక్కిరి దారాల్లాంటి నూడుల్స్‌ని కదుపుతూ, ఒలంపిక్ విన్యాసాలు చేస్తూ 'టక్..టక్..టింక్'.. అంటూ శబ్దాలు చేస్తూంది. ఘాటైన మషాల వాసనలు గాలిలో తేలుతున్నాయి. వాటితోపాటు కాలుష్య వాసన, పక్క కౌంటర్‌లో బెలూను లాంటి పూరీలు, ఆకాశంలో పగటి చుక్కల్లా ఆ వడ మీద జల్లిన కారం బూంది. 'ఫ్రైడ్‌రైస్, లెమన్ రైస్, రకరకాల పదార్థాల ఘుమఘుమ. ఆపక్కనే టీ స్టాల్. ఇక్కడ అడుగు వేయడానికి ఖాళీ లేదు. సింగిల్ టీ, కాఫీ, లెమన్ టీ, వన్‌బైటూ, ఆ కేక్, అది కాదు యిది. సమోసా, సాల్టు బిస్కట్' ఇలాంటి మాటలు విభిన్న కంఠస్వరాలు.

టీతో లోపల్నించి బయటకి రావడం యుద్ధంలో విజయమే. అక్కడే సిగరెట్లు తాగే వాళ్లు టీ కప్పు చేత్తో పుచ్చుకుని చూపులు టివి మీద పెట్టేవాళ్లే ఎక్కువ. ఆ గుంపులోంచి బయటికి వచ్చేది టూ ఆర్ త్రి పర్సంట్ మాత్రమే. ఓ తర్టీ ఫైవ్ వ్యక్తి టెలిఫోన్ స్తంభానికి ఆనుకొని సిగరెట్టుని ఆప్యాయంగా ఆస్వాదిస్తూ.. క్యాన్సర్, ఎసిడిటి, లంగ్స్ ఇన్‌ఫెక్షన్‌లను తన బాడిలోకి ఆహ్వానిస్తూ, ఇది వేరే సంగతి. ప్రియురాలిని టచ్ చేస్తున్నంత సున్నితంగా యాస్ రాలుస్తూ, టి.వి.లో వస్తున్న క్రికెట్‌లో లీనం అయిపోయాడు. సిగరెట్లు వెలిగించుకొనేందుకు, షాపు అతను టెలిఫోన్ స్తంభానికి కట్టిన కంబారు తాడు గాలికి వూగుతూ నిప్పురవ్వల్ని రాలుస్తూంది. స్తంభానికి ఆనుకున్న వ్యక్తిని కాలుతున్న తాడు 'అగ్గి' ఏ క్షణానైనా ప్రియురాలు కసుక్కున కొరికినట్లు కాటెయ్యచ్చు. 'చుఫ్..' ఈ అభాగ్యుడు క్రికెట్ మ్యాచ్ తప్ప మరేం లేదన్న లోకంలోకి వెళ్లిపోయాడు. టీ స్టాల్ ముందు పై విభిన్న సన్నివేశాలు నడుస్తూండగా..

ఓ కుక్క తినేవాళ్లని, తాగే వాళ్లని చూస్తుంది.



కొద్ది సెకండ్ల గడిచాయి. ప్రతి ఒక్కర్ని మరల దృష్టి మార్చి మార్చి చూసి, వీళ్లు మొఖం వాచినట్లున్నారు,నా వైపేం చూస్తారు. అనుకున్న ఫీలింగ్ దానిలో 'చల్. రాజా..ఏం మనుషులు వీళ్లు. అడగలేని మూగజీవి కళ్లు అప్పగించి చూస్తున్నా చెయ్యి విదిల్చడం లేదు. మనలాంటి వార్ని ఎవరు ఆదరిస్తారు.' ఇలా అనుకుని అక్కడ్నించి కదిలినట్లనిపించింది. మళ్లీ ఆగి ఇటూ అటూ తారట్లాడుతూ ముక్కుచిట్లించి టీ స్టాల్ వాళ్లు సైడు కాల్వ మీద వేసిన గ్రిల్లు దగ్గరకు వెళ్లి గ్రిల్లులోంచి లోపలికి చూసింది. ఈ తరుణంలో మురుగు వాసన ఒక్కసారిగా.., అంతే కాదు మురుగు నీరు వేగంగా కదులుతూంది. కుక్క నిలబడి వాసన చూస్తున్న దగ్గర గ్రిల్లు కింది భాగంలో మురుగు నిండిన సైడ్ కాలవలో చిత్రం!

ఓ మనిషి రెండుగులు వెడల్పులేని సైడ్‌కాలువలోకి, ఆ గ్రిల్లు కిందికి ఎలా వెళ్లాడు? ఆ వ్యక్తి మోచేతుల వరకు మురుగునీరు, ఆ మురుగులో ఏదో చేస్తున్నాడు. ఈ కారణంగా మురుగు వాసన. కాల్వలో వున్న ఇతని వీపు పై భాగంలో గ్రిల్లు దాని మీద నుంచి అటూ ఇటూ తిరుగుతున్నారు జనం. ఓ మనిషి కింద ఉన్నాడని అతని మీదనుంచి వెళ్తున్నాం అనే దృష్టి కాని, జస్ట్.. జస్ట్.. సెకండులో నూరోవంతు కూడా ఆలోచించడం లేదు.

ఏంటి? వెదుకులాట? ఎందుకూ మూతికి ముక్కుకి దగ్గరగా దుర్గంధంలో! ఇదే సైడ్ కాలవలో ఎగువున ఇద్దరు యూరినల్స్‌కి వెళ్తున్నారు. ఏమిటీ? ఈ వెదుకులాట, కడుపులో నాలుగు చేతుల్తో దేవినట్లు పొట్ట ప్రేగులు కదిలిపోయాయి.

సైడ్ కాల్వ అంచుల్లో వున్న షాపుల వద్ద టీ స్టాల్ కిళ్లికొట్టు ఏవైనా సరే అక్కడ ఇచ్చి పుచ్చుకొనే క్రమంలో పడిపోయిన వస్తువుల కోసం చిల్లర నాణ్యాల కోసం దుర్గంధంలో వెదుకులాట.

కుక్క అక్కడ్నించి తినడం కోసం ఏదైనా దొరుకుతుందా అన్నట్లు వాసన చూసుకుంటూ రోడ్డు మలుపు తిరిగి వెళ్లిపోయింది.

***

అరవై సంవత్సరాల గణతంత్ర వేడుకలు జరుపుకున్నాం. ఘనంగా.. వైభవంగా.. ఎందరివో జీవితాలు మురుగు కూపంలో మురుగు వాడల్లో పేవ్‌మెంట్ల మీద అనాథ జీవితాలుగా, నిరక్షరాస్యత ఆకలి వేళ్లని చీకటి మయ జీవితాల్లోకి నెడుతూంది.

మురుగులో దొరికిన నాణాలను ఆ వ్యక్తి శుభ్రం చేస్తున్నాడు. అశోక చక్రవర్తి మనకు ఇచ్చిన రాజముద్ర కనిపించే మూడు సింహాలు మురుగు తొలగి మెరుస్తున్నాయి. మరి ఈ మురుగు బడుగు జీవితంలో మెరుపు? ఎప్పుడు?..

ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేద్దామా?

-బంటీరాం పొన్నూరి
**9948616628**